# ఒక ప్రణయకథ

మా వాడి ప్రణయకథలో నేను జోక్యం కలిగించుకోకుండా ఉండాలని చాలా ప్రయత్నించాను. కాని సూర్యమే నన్ను బలవంతంగా అందులోకి లాగాడు; నెలరోజులు ఆలోచించి మరీ రాసిన తన ప్రణయలేఖ చూపించాడు.

"కమలా, నన్ను వివాహం చేసుకోవటానికి నీకేమన్నా అభ్యంతరం ఉందా ?

"నీకు ఉత్తరం రాయకుండా ఉండాలని నెల్లాళ్ళనించీ ప్రయత్నిస్తున్నాను. లాభం లేకపోయింది. నిన్ను కోరకుండా ఉండాలని నేను చేసిన ప్రయత్నమంతా వృథా అయిపోయింది.

"నన్నే అడిగేటట్టయితే నన్ను పెళ్ళాడమని నీకు సలహా ఇవ్వను. నాకన్న అన్నివిధాలా మంచివాణ్ణీ, అందమైనవాణ్ణీ, ధనికుణ్ణీ, తెలివిగలవాణ్ణీ పెళ్ళాడమని సలహా ఇస్తాను — సూర్యం !"

"ఎట్లా ఉంది ఉత్తరం ?" అన్నాడు సూర్యం.

నే నాలోచించి, "నీలాగేఉంది. పోస్టులో వేసిచూడు." అన్నాను.

దానికివచ్చిన సమాధానంకూడా వాడు నాకు చూపించాడు. నన్నా జవాబు పైకి చదవమన్నాడు.

"సూర్యంగారూ, మీ ఉత్తరంగురించి ఏమనుకోవాలో నాకు తెలీదు. నన్ను మీరు అవమానం చెయ్యటానికి ప్రయత్నిస్తున్నట్టు భావిస్తున్నాను. మీరింకా మంచిగా, అందంగా, ధనికులుగా, తెలివిగా లేనందుకు మిమ్మల్ని పెళ్ళాడలేను — కమలాదేవి."

నే నా ఉత్తరం పూర్తిచెయ్యగానే సూర్యం విరగబడి నవ్వసాగాడు. వాడికి మతిచెడిందని నా కనుమానం తగిలింది. ఎందుచేతనంటే వాడు కమలను ప్రేమించాడు, తన ప్రేమను విమర్శించుకున్నాడు, దాని బలాన్ని పరీక్షించి అది గట్టిప్రేమే అని నిర్ణయించుకున్నాడు. ఆ ప్రేమ ఇట్లా పరిణమించినందుకు నాకు చాలా విచారంవేసింది.

నేను వాణ్ణి భుజంమీద తట్టి, "ఫరవాలేదురా, ఓ నెల్లో నువ్వా అమ్మాయిని మరచిపోతావు—కాస్త ప్రయత్నిస్తే!" అన్నాను.

వాడింకా నవ్వసాగాడు.

"ఆ పశువునా?" అన్నాడు నవ్వుతూనే. "ఆ మృగంకోసం నెల రోజులు అకారణంగా హైరాను పడ్డాను! నన్ను చెప్పుతో కొట్టక సమదా యిస్తావేమిటి?"

నా గుండెమీది బరువు తీసేసినట్టయింది.

తరవాత రెండు నెల్లకు కాబోలు కమల వివాహం అయింది. ఆమె భర్త ఐ. సి. ఎస్. పరీక్ష కొత్తగా పాసయి ఎక్కడో డిప్టీ కలెక్టరు ఉద్యోగం సంపాదించాడు. దాదాపు దొరల్లే ఉండేవాడు.

మా సూర్యంలో కలిగినమార్పు నేను నాలుగైదు రోజులకుగాని గమనించలేదు. వాడన్నమూ నిద్రా విసర్జించాడు. వారం రోజుల్లో పీనుగల్లే అయిపోయినాడు. వాడి నవ్వు విని యెన్నో సంవత్సరాలయి నట్టుంది. వాణ్ణిచూస్తేనే భయం కలగసాగింది.

"ఏమిట్రా సూర్యం?"-అన్నాను.

"ఆ కమల—" అన్నాడు.

"ఆ కమలమీద నీకు మళ్ళీ వ్యామోహం కలిగిందా ఏమిటి?" అన్నాను ఆశ్చర్యంతో.

సూర్యం తల అడ్డంగా తిప్పాడు.

"కమల అన్నమాట నిజం. నేనామెను అవమానించాను, ఆ ఉత్తరం రాసి."

నాకింకా అర్థంకాలేదు. "అప్పట్లో నువ్వట్లా అనుకోలేదే?" అన్నాను.

"అప్పటి కదీ అవమానం కాదు. కమల పెళ్ళివల్లనే నా ఉత్తరం అవమానంగా పరిణమించింది."

"ఎట్లా?"

"కమల కెటువంటి మొగుడు దొరికాడో చూడు! కమలని ప్రేమించ టానికిగాని, ప్రేమించానని చెప్పటానికిగాని నాకే మధికారం ఉంది?"

"కమలను పశువన్నవాడివి కాదూ?"

"అప్పుడు—నాకు సమాధానం రాసినప్పుడు కమల పశువే!"

సూర్యానికి నిజంగా పిచ్చిపట్టిందనే ఇప్పటికీ నా విశ్వాసం. వాడు క్రమేపీ క్షీణించసాగాడు...వాడి గొడవ ఏమిటో నా కిప్పటికీ తెలియదు.